ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
సోమవారం 21 జూలై 2025 | 5




మందుల సామాజికవర్గానికి బీసీ-ఏ సర్టిఫికెట్లు



- 25 ఏళ్ల సమస్యకు పరిష్కారం
- చొరవ చూపిన మంత్రి సుభాష్

కుల ధ్రువీకరణ పత్రాలు అందచేస్తున్న మంత్రి సుభాష్

ద్రాక్షారామ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామకు చెందిన ఒక సామాజికవర్గానికి 25ఏళ్లుగా ఉన్న కులధ్రువీకరణ పత్రాల సమస్య మంత్రి సుభాష్ చొరవతో పరిష్కారమైంది. ద్రాక్షారామలో మండాలమ్మపేటవద్ద రోడ్డు మందులు(మూలికలు) అమ్ముకునే కుటుంబాలు నివసిస్తున్నాయి. ఎటువంటి కులధ్రువీకరణ పత్రాలు లేకుండానే వీరి జీవనం సాగిపోతోంది. ఇటీవల సామాజికవర్గ పెద్దలు గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణకి ఈ సమస్య గురించి తెలియజేశారు. ఆమె మంత్రి సుభాష్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఆయన స్పందించి ఆర్డీవో, ఇతర ఉన్నతాధికారులను పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ గెజిట్ ప్రకారం వీరు బీసీ-ఏ సీరియల్ నెంబర్ 36లో ప్రకటించిన దాని ప్రకారం బీసీ-ఏ 38(155) చెందిన వారిగా గుర్తించారు. వీరందరికీ ఆదివారం బీసీ-ఏ కులధ్రువీకరణ పత్రాలు అందించారు. సమస్యను పరిష్కరించిన మంత్రి సుభాష్, సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఆర్డీవో, తహసీల్దార్‌లకు వారంతా కృతజ్ఞతలు తెలిపారు.



ప్రత్యేక అలంకరణల్లో గ్రామదేవతలు

ఆషాఢమాసం సందర్భంగా జిల్లావ్యాప్తంగా మండలంలోని గ్రామాల్లో గ్రామదేవతలకు ఆదివారం ప్రత్యేక అలంకరణలు చేశారు. అమ్మవారు శాకంబరిగా దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు ఆషాడం సారెలు సమర్పించడానికి ఆలయాలకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

పి.గన్నవరం గ్రామదేవత శాకంబరిగా దర్శనమిచ్చిన శ్రీతాటమ్మతల్లి అమ్మవారు

అలా విహారిద్దాం!



కోనసీమలోని గ్రామీణ ప్రాంతంలో ప్రకృతి రమణీయ దృశ్యం

ఒకవైపు బంగాళాఖాతం సముద్రతీరం.. మూడువైపులా గోదావరి నదీప్రవాహాల నడుమ ప్రకృతి రమణీయతతో పర్యాటకులను మంత్రముగ్ధుల్ని చేసే అందాలను సొంతం చేసుకున్న కోనసీమలో పర్యాటకులను ఆకర్షించడానికి బోట్ స్పోర్ట్స్, బోట్ టూరిజానికి ప్రభుత్వం పెద్ద పీట వేయనుంది. గోదావరి నదులను వేరు చేసే బొబ్బర్లంక బ్యారేజీ నుంచి ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వరకు అద్భుతంగా ప్రవహించే పంటకాల్వల్లో బోటు రవాణా ద్వారా పర్యాటకులకు వినూత్న అనుభూతిని కల్పించనున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రాలైన వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాలకు నేరుగా బోట్లలో వెళ్లి స్వామివార్లను దర్శించుకునేలా ఏర్పాట్లు చేయనున్నారు. దిండిలోని హరిత రిసార్ట్‌వద్ద అడ్వెంచర్ వాటర్‌స్పోర్ట్స్ సౌకర్యాలను విస్తరించడానికి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఈ మూడు ప్రాంతాల్లో గోదావరి నదులు, కాల్వల అనుసంధానంగా అడ్వెంచర్ బోట్ టూరిజం అభివృద్ధి కోసం జిల్లా యంత్రాంగం ఆరు పాయింట్లను గుర్తించి టెండర్లు పిలిచింది. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు భూసేకరణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

- కోనసీమలో జలవిహారాలు.. వాటర్ స్పోర్ట్స్
- ప్రతిపాదనలు అమలు దిశలో పర్యాటకశాఖ
- బొబ్బర్లంక-లొల్ల లాకుల వరకు జలవిహారం
- అంతర్వేదిలో బోటు విహారాలకు ఏర్పాట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అఖండ గోదావరినుంచి వశిష్ఠ నదిని విభజించి బొబ్బర్లంకనుంచి ఆత్రేయపురం మండలం లొల్ల లాకుల వరకు 13 కిలోమీటర్ల మేర ప్రవహించే ప్రధాన కాల్వలో బోటింగ్, స్పోర్ట్స్ నిర్వహణకు అనువుగా ఉంటుందని గుర్తించారు. గతేడాది సంక్రాంతి సీజన్‌లో లొల్ల లాకులవద్ద వినూత్నమైన రీతిలో పడవ పోటీలు నిర్వహించారు. లొల్లలాకులకు సమీపంలో వాడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి నెలకు 3లక్షల మందికిపైగా యాత్రికులు సందర్శిస్తుంటారు. ఇక్కడకు సమీపంలోనే మండల కేంద్రం, వాడపల్లి వెంకన్న ఆలయం, ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయాలతోపాటు 216 జాతీయ రహదారికి అత్యంత చేరువలో ఉన్నాయి. ప్రకృతి అందాలతోపాటు పల్లెసీమలు గ్రామీణ వాతావరణం ఉట్టిపడేఈప్రాంతంలో పర్యాటకులకు, భక్తులకు కొత్తఅనుభూతిని మిగులుస్తాయి. అందుకోసం స్పీడు బోట్లు, ఫుడ్‌కోర్టులు, బోటింగ్ స్పోర్ట్స్ అనువుగా ఈ ప్రాంతాన్ని తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ చర్యలకోసం ఇటీవలే కలెక్టర్ మహేష్‌కుమార్ ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లాలో ఆరు ప్రాంతాల్లో బోటు టూరిజం అభివృద్ధి ద్వారా యువత ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే రీతిన టెండర్ల ప్రక్రియను పూర్తి చేశారు.

దిండి రిసార్ట్సులో వాటర్ స్పోర్ట్స్..

మలికిపురం మండలం దిండిలోని హరిత రిసార్ట్స్ ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుని వాటర్ స్పోర్ట్స్ హబ్ నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇక్కడ ఏపీ టీడీసీ ఆమోదించిన జెట్టీని ఉపయోగించి హౌస్ బోట్లు, 50 సీట్ల ప్యాసింజర్ బోట్లతోపాటు వివిధ రకాల స్పోర్ట్స్ రైడ్‌లు నిర్వహించేందుకు అనువైన ప్రదేశంగా గుర్తించారు. పర్యాటకులకు సాంకేతిక సౌకర్యాలతోపాటు భద్రత, విడిది వంటి అనేక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడినుంచే పర్యాటకులు అంతర్వేదిలోని లక్ష్మీనరసింహస్వామి టెంపుల్‌కు వెళ్లి దర్శనం చేసుకునే వీలును బోటు ద్వారా ప్రయాణించి స్వామిని దర్శించుకునేలా ఏర్పాట్లు, నర్సాపురం నుంచి వశిష్ఠ నదిలో బోట్ల ద్వారా వెళ్లి స్వామిని దర్శించుకునేలా అనువైన పరిస్థితులను పర్యాటకశాఖ అధికారులు పరిశీలించి నివేదికలను సిద్ధంచేశారు.

అంతర్వేదిలో అడ్వెంచర్ టూరిజం

అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ సమీపంలో ఉన్న వశిష్ఠ నది సముద్రంలో కలిసే సంగమ ప్రాంతమైన అన్నాచెల్లెలు గట్టువద్ద పర్యాటకులను ఆకర్షించే రీతిలో బోట్ టూరిజం అభివృద్ధికి పరిశీలన చేశారు. పర్యాటకులు వేచి ఉండే ప్రాంతాలు, పార్కింగ్, విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టులు వంటి సౌకర్యాలను స్థానికంగా అభివృద్ధి చేయడంవల్ల బోటింగ్ ప్రాజెక్టు ఒక మంచి పర్యాటక వెంచర్‌గా అభివృద్ధి చెందే రీతిలో సన్నాహాలు చేస్తున్నారు. స్పీడు బోట్లు, స్కై రైడర్స్, సాధారణ బోట్ల వంటితోపాటు 50సీట్ల కెపాసిటీ బోట్ల ఏర్పాటు ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచనున్నారు. వశిష్ఠనదినుంచి బోటులో రక్తతుల్య కాల్వ ద్వారా అంతర్వేది ఆలయ సమీపానికి చేరుకునేలా బోటింగ్ యాక్టివిటీపై అధ్యయనం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.అంతర్వేది ఆలయానికి ఆధునిక నీటి ఆధారిత వినోదాన్ని సాంస్కృతిక పర్యాటకంతో విలీనం చేయడంద్వారా ఈ ప్రాజెక్టు ప్రత్యేకమైన అనుభూతులను మిగిల్చేలా రూపకల్పన చేస్తున్నారు.

వాటర్ స్పోర్ట్స్ ఫెసిలిటీ సౌకర్యాల కోసం టెండర్లు: కలెక్టర్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ఫెసిలిటీ మెరుగుపరిచేందుకు ఆరు ముఖ్య ప్రాంతాలను గుర్తించి టెండర్లు పిలిచాం. వాటిలో బొబ్బర్లంకనుంచి లొల్ల లాకులు, దిండి రిసార్ట్స్ అంతర్వేది మొగ ప్రాంతంతోపాటు ఆరు ప్రాంతాల్లో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే టెండర్లు పిలిచాం. దీనిలోభాగంగా అంతర్వేదిలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంఉన్న ప్రాంతంలోవాటర్‌స్పోర్ట్స్, జలవిహారానికి అనువైన ప్రదేశాలను పరిశీలించాం. కొన్ని ప్రాజెక్టులకోసం భూసేకరణ కూడా చేపట్టాల్సి ఉంది. కొన్ని ఏజెన్సీలు ముందుకు రావడంతో ఇవి త్వరలోనే ఆచరణ సాధ్యం కానున్నాయి.

పీఆర్సీ బకాయిల విడుదలకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలి

- ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం తీర్మానం

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పీఆర్సీ బకాయిల విడుదలకు ప్రభుత్వం రోడ్డు మ్యాప్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని ఎస్టీయూ జిల్లాశాఖ కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ప్రభుత్వపాఠశాలల పరిరక్షణకు ఎస్టీయూ సంఘపరంగా కృషి చేసేందుకు నిర్ణయించారు. ఎస్టీయూ జిల్లా శాఖ ద్వితీయ కార్యవర్గ సమావేశం ఆదివారం అమలాపురంలోని ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా ఫ్యాప్టో చైర్మన్, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 13 నెలలు అయినా పీఆర్సీపై మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. భవిష్యత్తులో 5వేల పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉందన్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలో అందరూ విద్యార్థులకు ఒకే వయసు విధానాన్ని అమలు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శి నివేదికను జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు సభ ముందు ఉంచారు. సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, ఉపాధ్యక్షుడు చొప్పల రాంబాబు, ఉపాధ్యాయవాణి కన్వీనర్ చిక్కం మైనరుబాబు, అభయ్ కన్వీనర్ రాపాక రామకృష్ణప్రసాద్, జిల్లా మహిళా కార్యదర్శి మునగాల భవానీ, రాష్ట్ర కన్వీనర్లు వాసంవెట్టి వెంకటేశ్వరరావు, సీహెచ్ ఉమాపతిశాస్త్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట బాలకృష్ణ, కుడుపూడి హేమంత్ శివకుమార్, నల్లా రామకృష్ణ, వేమన సత్యనారాయణ, వంగా అయ్యప్పకుమార్, నిమ్మన సత్యనారాయణ, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.



ఎస్టీయూ జిల్లాశాఖ కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

బరువు 1.8 కిలోలు ధర రూ.22 వేలు 7
- యానాం మార్కెట్‌లో పులస

దొరకని ఇంజనీరింగ్ విద్యార్థి ఆచూకీ 7
- కొనసాగుతున్న గాలింపు చర్యలు

బరువు 1.8 కిలోలు ధర రూ.22 వేలు

యానాం మార్కెట్‌లో పులస





యానాం మార్కెట్‌లో పులసతో మత్స్యకార మహిళ రత్నం

యానాం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): యానాంలో వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు కిలో 800 గ్రాముల బరువు ఉన్న పులస చిక్కింది. దీనిని ఆదివారం యానాం మార్కెట్‌లో పోనమండ భద్రం, రత్నం దంపతులు రూ.22వేలకు పాడి దక్కించుకున్నారు. గౌతమి గోదావరిలో ఎర్రనీరు పోటెత్తిన సమయంలో పులసలు లభ్యమవుతాయి. వారం రోజుల క్రితం యానాం మార్కెట్‌కు తొలి పులస వచ్చి రూ.18వేల ధర పలికిన విషయం తెలిసిందే. అయితే రానున్న వరదకు మరిన్ని పులసలు దొరికే అవకాశం ఉందని మత్స్యకారులు చెప్తున్నారు.

రూ.20 లక్షల కరెన్సీ నోట్లతో..

సత్తెమ్మతల్లికి అలంకరణ



ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లిని రూ.20లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించారు. ఆషాఢమాసం ఆదివారం సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు తీర్చుకున్నారు. గొలకోటి ఫణి, జీవీఎస్ బ్రహ్మానందం, గొలకోటి బాబి పులిహోర, అన్నవరం ప్రసాదం అమ్మవారికి సమర్పించి భక్తులకు ప్రసాదంగా వితరణ చేశారు. వేముల వెంకన్నబాబు చిన్నపిల్లలకు పాలు పంపిణీ చేశారు. గాలిదేవర రాధాకృష్ణ కుటుంబ సభ్యులు బూరెలను ప్రసాదంగా భక్తులకు పంపిణీ చేశారు.

నాలుగు కోళ్లను మింగిన నల్ల తాచు



జనుపల్లిలో కోళ్లను మింగిన నల్లతాచును పట్టుకున్న గణేష్‌వర్మ

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనుపల్లి బాలయోగి ఘాట్ సమీపంలో మారిశెట్టి నాగభూషణం ఇంటి ఆవరణలో ఉన్న పాడుబడిన బాత్‌రూమ్‌లో ఉన్న నాలుగు కోడిపిల్లలను ఆరు అడుగుల నల్లతాచు ఆదివారం మింగేసింది. కోళ్లు చేస్తున్న శబ్దాన్ని గుర్తించిన ఆ కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లేసరికి కోళ్లు కనిపించకపోగా నల్లతాచు కదలలేని స్థితిలో ఉండడాన్ని గుర్తించారు. వెంటనే బాత్‌రూమ్‌కు గడియవేశారు. వెంటనే భీమనపల్లికి చెందిన స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. కోళ్లను మింగిన తాచు కోడిపిల్లలను జీర్ణించుకోలేక ఒక్కొక్కటిగా ఆ బాత్‌రూమ్‌లోనే కక్కేసింది. అక్కడు చేరుకున్న వర్మ తాచు పామును చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి సురక్షిత ప్రాంతంలో విడిచిపెట్టాడు.

వ్యంగ్య చిత్ర పోటీల్లో రాముకు బహుమతి



మాడా రాము గీసిన కార్టూన్

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): శ్రీమామిడిపూడి రామకృష్ణయ్య స్మారక జాతీయస్థాయి వ్యంగ్య చిత్ర పోటీల్లో కోనసీమ జిల్లా బండారులంకకు చెందిన వ్యంగ్య చిత్రకారుడు మాడా రాము గీసిన కార్టూన్‌కు ప్రత్యేక బహుమతి లభించింది. నెల్లూరులో విశాలాక్షి విరజల్లుల పేరిట ఆదివారం నిర్వహించిన బహుమతి ప్రదానోత్సవ సభలో వ్యంగ్య చిత్రాల ప్రదర్శన నిర్వహించి అభినందించారు.

వ్యక్తిపై ముగ్గురి దాడి

అట్రాసిటీ కేసు నమోదు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యవహారంలో కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం వెలువలపల్లికి చెందిన దోనిపాటి మహేష్‌పై రెండు పర్యాయాలు విచక్షణారహితంగా దాడి చేయడంతో గాయపడి అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిచేసిన ముగ్గురు వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు ప్రకారం.. అమలాపురం పురపాలక సంఘంలో గతంలో పనిచేసి ప్రస్తుతం తునిలో పనిచేస్తోన్న ఉదయశంకరం అనే వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి అమలాపురం పరిసర ప్రాంతాలకు చెందిన యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ నుంచి రూ.6.70లక్షలు వసూలు చేశాడు. పురపాలక సంఘంలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఇప్పిస్తానని గత కొన్ని నెలలుగా నమ్మించాడు. ఈ వ్యవహారంలో మధ్య వర్తిత్వం వహించిన రావులపాలెం శ్రీశాంతి ఒకేషనల్ కళాశాలలో ఫ్యాకల్టీగా పనిచేస్తున్న దోనిపాటి మహేష్‌ను ఈనెల 19వ తేదీ రాత్రి 7.30గంటల సమయంలో యల్లమిల్లి విజయ్, కృష్ణ, మహేష్ ఆటోలో ఎక్కించుకుని పేరూరు వై.జంక్షన్ నుంచి కామనగరువు సమీపంలోని కొబ్బరి తోటల్లోకి తీసుకువెళ్లి దాడి చేశారు. అక్కడి నుంచి అల్లవరం మండలం దేవర్లంక తీసుకెళ్లి అక్కడ మరోసారి దాడి చేశారు. గాయపడ్డ దోనిపాటి మహేష్‌ను బంధువులు అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. సంఘటనా స్థలాన్ని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పరిశీలించి విచారణ చేపట్టారు. ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విజయ్, కృష్ణ, మహేష్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

వివాహిత హత్య కేసును సుమోటాగా స్వీకరించిన మహిళా కమిషన్

అమలాపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరంలో ఇటీవల జరిగిన మహిళ హత్య కేసును జాతీయ మహిళా కమిషన్ సుమోటాగా స్వీకరించింది. బి.సావరంలో ఓలేటి పుష్ప (22) షేక్ షమ్మా(22) అనే వ్యక్తితో సహజీవనం చేసింది. అయితే ఈనెల17న పుష్పను వ్యభిచారం చేయాలని షమ్మా పట్టుబట్టాడు. అందుకు పుష్ప ఒప్పుకోకపోవడంతో అతిదారుణంగా హతమార్చాడు. ఈ కేసుకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను 3 రోజుల్లో అందించాలని మహిళా కమిషన్ ఆదేశించింది. బాధిత మహిళా కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చింది.

పట్టించు కో(య)..రా!


కనుమరుగవుతున్న కోయ భాష

ఆందోళన చెందుతున్న ఆదివాసీ సంఘాలు

నేడు విశ్వ కోయ (గోండి) భాషా దినోత్సవం



చింతూరు మండలంలోని ఓ పాఠశాలలో ఆదివాసీ విద్యార్థులు (ఫైల్)



కోయ వాచక పుస్తకం



కోయ భాషలో రచించిన పద్యాల పుస్తకం

(చింతూరు - ఆంధ్రజ్యోతి)

లిపి లేని భాషలు కాలక్రమంలో కనుమరగవుతున్నాయి. ఈ కోవలోకే కోయ భాష కూడా చేరుతుందన్న ఆందోళనను ఆదివాసీ సంఘాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2018 జూలై 21న దేశవ్యాప్తంగా ఉన్నటువంటి ఆదివాసీ మేధావులు ఢిల్లీలో సమావేశమయ్యారు. కనుమరుగవుతున్న విశ్వ కోయ (గోండి) భాషలను సంరక్షించుకోవాలని తీర్మానించుకున్నారు. ఆ మేరకు ప్రతి ఏటా జూలై 21న విశ్వ కోయ (గోండి) భాషా దినోత్స వాన్ని జరుపుకోవాలని నిచ్చయించుకున్నారు. నాటి నుంచి దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో వ్యాప్తి చెంది ఉన్న ఆదివాసీలు వివిధ ఆదివాసీ సంఘాల నేతృత్వంలో విశ్వ కోయ భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. కాగా ఈ దినోత్సవాన్ని ప్రభుత్వమే నిర్వహించాలన్న ప్రధాన డిమాండ్ ప్రస్తుతం ఆదివాసీ సంఘాల నుంచి వినిపిస్తోంది. దేశవ్యాప్తంగా 8 రాష్ట్రాల్లో దాదాపు 3 కోట్ల మంది ఆదివాసీలు ఉన్నట్టు అంచనా. ప్రాథమిక విద్య మాతృ భాషలోనే బోధించాల న్నది ఆదివాసీ మేధావుల అభిప్రాయంగా ఉంది. ఉమ్మడి రాష్ట్రం నాటి కాలంలో ఆదివాసీ ప్రాంతాల్లో కొన్నేళ్ల పాటు ఒకటి నుంచి 3 వరకు తరగతులు కోయ భాష లోనే బోధించారు. స్థానిక ఆదివాసీ యవతను ఉపాధ్యాయులుగా నియమించి గౌవరవేతనం చెల్లించేవారు. నాడు రాష్ట్రంలోని 8 జిల్లాల్లోని 920 ఆదివాసీ ప్రాంత పాఠశాలల్లో 18,795 మంది ఆదివాసీ విద్యార్థులకు ఈ తరహా బోధన జరిగింది. ఖమ్మం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో కోయ భాష, కర్నూలు, అనంత పురం సుగాలి భాష, విశాఖపట్నం జిల్లాలో కువి, కొండ భాష, శ్రీ కాకుళం, విజయనగరం జిల్లాల్లో సవర భాషలకు అనుగుణంగా కోయ భారతి పుస్తకాలను ముద్రించి బోధించారు. సహజంగా ఆదివాసీ చిన్నారులు వారి ఇళ్ల వద్ద మాతృ భాషలో మాట్లాడుతుంటారు. వారిని పాఠశాలల్లో చేర్పించి తెలుగు లేదా ఆయా రాష్ట్ర భాషల్లో బోధిస్తే పూర్తిగా అర్థంకాక చివరకు డ్రాప్ అవుట్స్ అవు తున్నారన్నది ఆదివాసీ సంఘాల వాదన. ఈ తరహా సమస్యను తొలగించాలంటే అంగన్‌వాడీ స్థాయి నుంచి మూడో తరగతి వరకు వారి మాతృ భాషలోనే బోధించాలని ఆదివాసీ మేధావులు అంటున్నారు. కాగా ఉమ్మడి రాష్ట్రంలో పడిన అడుగులు ఇప్పుడు మందగించాయన్న ఆరోపణ ఉంది.

సత్యదేవుడికి పట్టువస్త్రాల సమర్పణ



ఆవిర్భావ దినోత్సవాలకు పట్టువసాతిలు అందుకుంటున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి ఈనెల 25, 26 తేదీలలో జరిగే ఆవిర్భావ దినోత్సవాలు పురస్కరించుకుని స్వామి,అమ్మ వార్లకు.. ఇతర ఉపాలయాల్లో కొలువైన అమ్మవార్లకు నూతన పట్టువస్త్రాలను ఆదివారం విశాఖపట్నంకు చెందిన ఏ నాగేశ్వరావు అందజేయగా వాటిని ఆలయ ప్ర ధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యానికి ఈవో సుబ్బారావు దంపతులు అందించారు. కార్యక్రమంలో అర్చకులు సుధీర్ ఏఈవో భాస్కర్ తదితరులు ఉన్నారు.

లక్ష ప్రసాదం ప్యాకెట్ల విక్రయాలు

సత్యదేవుడి ప్రసాదం కొనుగోలుకు ఆదివారం భక్తులు బారులు తీరారు. ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో అధికసంఖ్యలో భక్తులు తలుపులమ్మ లోవకు తరలివెళ్లారు. తిరుగు ప్రయాణంలో అన్నవరం జాతీయ రహదారిపై ఉన్న సత్యదేవుడి నమూనాలయం, తొలిపావంచా వద్ద ఉన్న ప్రసాదం కౌంటర్లలో కొనుగోలు చేశారు. ఆదివారం ఒక్కరోజు సుమారు లక్ష ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటి ద్వారా సుమారు రూ.20లక్షల ఆదాయం లభించింది.



సత్యదేవుడి ప్రసాదం కోసం బారులు తీరిన భక్తులు

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏడీ ప్రత్యేక పూజలు



అన్నవరంలో ఏడీకి వేదాశీర్వచనం అందజేస్తున్న పండితులు

అన్నవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్.వి.రమణమూర్తి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలందజేశారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే వర్తింపచేయాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే పరిమితం చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లంకలపల్లి సాయిశ్రీనివాస్ సూచించారు. కోనసీమ జిల్లా అమలాపురం ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయం వద్ద ఆదివారం సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ తల్లికి వందనం తీసుకున్న తల్లులు ఎందరో తమ బిడ్డలను తీసుకుని రాజమార్గంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఎన్‌రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరిక సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4600 పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్మెంట్‌లో ఉండడం విచారకరమన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ప్రభుత్వం 11వ పీఆర్సీ బకాయిలు, టీఏ బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్ లోన్స్ బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. 12వ పీఆర్సీ వేసేందుకు జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు తక్షణం జాయింట్ యాక్షన్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుచేసి రోడ్డు మ్యాప్ ఇవ్వాలన్నారు. యాప్‌ల భారం నుంచి ఉపాధ్యాయులకు మోక్షం కల్పించాలన్నారు. ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదె సత్యపల్లంరాజు తదితరులు ఉన్నారు.

'గృహ నిర్మాణ సంస్థ' అధ్యక్షుడిగా చక్రవర్తి

కొవ్వూరు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కేఎస్ చక్రవర్తి నియమితులయ్యారు. ఆదివారం విజయవాడ యూటీఎఫ్ భవనంలో అసోసియేషన్ జనరల్ బాడీ మీటింగ్ జరిగింది. ఎన్.మల్లిఖార్జున రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా కొవ్వూరు పట్టణ హౌసింగ్ ఏఈ కేఎస్ చక్రవర్తి, జనరల్ సెక్రటరీగా చిత్తూరుకు చెందిన ఎస్.శ్రీరాములురెడ్డి, కోశాధికారిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన డి.శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. నూతనకార్యవర్గంలో 26 జిల్లాలకు చెందిన వారికి చోటు కల్పించారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలియజేశారు.



రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ సహాయ ఇంజనీర్ల అసోసియేషన్ కమిటీ సభ్యులు

దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇల్లు గుల్ల

కొంతమూరులో 18 కాసుల బంగారం, 3.5 కిలోల వెండి చోరీ



ఆధారాలు సేకరిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లి వచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో భద్రపర్చిన బంగారు ఆభరణాలు, వెండి వస్తు సామగ్రితో పాటుగా నగదును అపహరించుకుపోయారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన గరిమెల్ల పవన్‌కుమార్ శర్మ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 15న శ్రీశైలం మల్లిఖార్జునస్వామి దర్శనానికి వెళ్లారు. అనంతరం 20వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువా తలుపులు కూడా తెరిచి ఉన్నాయి. బీరువాలో భద్రపర్చిన 18 కాసుల బంగారు ఆభరణాలు, 3.5 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.10 వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించి పవన్‌కుమార్ రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తున్న ఆరుగురి అరెస్ట్

మూడున్నర కిలోల గంజాయి, 6 మోటారుసైకిళ్ల స్వాధీనం



గంజాయితో నిందితులను పట్టుకున్న పోలీసులు

కడియం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంక శ్మశానవాటిక సమీపంలో గంజాయి విక్రయం జరుగుతుందని డీఎస్పీ ఎస్.భవ్యకిషోర్‌కు సమాచారం రావడంతో ఎస్ఐ బీఎన్‌డీ దుర్గాప్రసాద్ సిబ్బందితో అక్కడికి వెళ్లారు. ఐదుగురు నిందితులు, ఓ మైనర్‌ను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.15వేల విలువైన మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాజానగరం, రాజవొమ్మంగి, గండేపల్లి, తణుకు, బొమ్మూరు, ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో దొంగిలించిన 6 మోటారుసైకిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. చెడు వ్యసనాలకు బానిసై జల్సా ఖర్చుల కోసం గంజాయి అమ్మకాలు, దొంగతనాలు చేస్తున్నట్టు గుర్తించామన్నారు. ఐదుగురు ఏజెన్సీ ప్రాంతం కేడీ పేట గ్రామం నుంచి గంజాయిని తీసుకొచ్చి ప్యాకెట్లుగా తయారు చేసి అమ్ముతున్నారని పేర్కొన్నారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్ట్

నిడదవోలు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం కోరుమామిడిలో ఆదివారం కోడిపందేలపై సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ సుందరరావు సిబ్బందితో దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1150 నగదు, 3 బైకులు, 2 కోళ్లు, 4 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

పొట్ట కూటికి పాట్లు!

కాకినాడ జిల్లా తలుపులమ్మ లోవలో పొట్ట కూటి కోసం శరీరమంతా రంగు వేసుకుని బొమ్మలుగా మారిన చిన్నారుల చిత్రాలే ఇవి.



– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.16.74 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న తలుపులమ్మ

తుని రూరల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవ దేవస్థానంలో ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పోటెత్తారు. క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆరు బయట వంటవార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. తుని రూరల్ సీఐ చెన్నకేశరావు ఆధ్వర్యంలో సుమారు 100 మంది బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి రూ.16.74 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.

పంట కాలువలో వృద్ధురాలి ఆత్మహత్య



అచ్చియ్యమ్మ మృతదేహం

రాయవరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పంట కాలువలో వృద్ధురాలు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా రాయవరం రాజేశ్వరకాలనీకి చెందిన కొండవిల్లి అచ్చియ్యమ్మ (70) బోదకాలు, ఆస్తమాతో బాధపడుతుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు. రాయవరంలో ఉన్న కుమార్తె ఇంటి వద్ద నుంచి ఆదివారం ఉదయం లొల్లలో హోమియోపతి మందులు తెచ్చుకునేందుకు వెళ్తున్నట్టు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన అచ్చియ్యమ్మ మండపేట- రామచంద్రపురం ప్రధాన కాలువలో మాచవరం వద్ద కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కాలువలో వృద్ధురాలు మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు రాయవరం పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఆధ్వర్యంలో కాలువలో మృతదేహాన్ని బయటకు తీసి శవ పంచనామా అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి అల్లుడు మాడా ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

దొరకని ఇంజనీరింగ్ విద్యార్థి ఆచూకీ

గోదావరిలో కొనసాగుతోన్న గాలింపు చర్యలు



గౌతమి గోదావరిలో గాలింపు నిర్వహిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం

ఆత్రేయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చి గోదావరిలో శనివారం ఉదయం స్నానమాచరిస్తుండగా ఖమ్మం జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ విద్యార్థి పామర్తి దినేష్ (22) గల్లంతైన విషయం విధితమే. శనివారం నుంచి ఆదివారం సాయంత్రం వరకు సీఐ విద్యాసాగర్ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది, ఎస్డీఆర్ఎఫ్ బృందం 3 బృందాలుగా విడిపోయి గౌతమి గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభ్యం కాలేదు. ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ తెలిపారు. ఖమ్మం నుంచి వచ్చిన బంధుమిత్రులు గోదావరి పరిసర ప్రాంతాల్లో గాలిస్తున్నారు.

సాధారణ స్థాయిలో గోదావరి ప్రవాహం

49 వేల క్యూసెక్కులు సముద్రంలోకి

ధవళేశ్వరం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గోదావరి ప్రవాహం సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ఆదివారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 49,422 క్యూసెక్కులు ప్రవాహాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. నీటి మట్టం 10.90 అడుగులుగా నమోదైంది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 5వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 2700 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 6700 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం 12.70 అడుగులుగా నమోదైంది.

మోతుగూడెంలో దర్శకుడు బోయపాటి సందర్శన

మోతుగూడెం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో ఆదివారం ప్రముఖ సినీ దర్శకుడు బోయపాటి శ్రీను పర్యటించారు. తన బృందంతో కలిసి అఖండ2 సినిమా చిత్రీకరణలో భాగంగా పొల్లూరు జలపాతం, ధారాలమ్మ గుడి వద్ద పిక్నిక్ స్పాట్‌తో పాటు కొన్ని ప్రదేశాలను సందర్శించారు.



పిక్నిక్ స్పాట్‌లో బృందంతో వెళ్తున్న దర్శకుడు బోయపాటి శ్రీను

బదిలీల్లో ఎంటీఎస్ ఉద్యోగులకు అన్యాయం

అంబాజీపేట,జూలై20(ఆంధ్రజ్యోతి):ఎంటీఎస్ ఉపాధ్యాయుల బదిలీల్లో కొందరూ ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని ఎంటీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రెసిడెంట్ సీహెచ్ కేశవకుమార్ ఆరోపించారు. కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు, ఎమ్మెల్సీ రాజశేఖర్‌కు వినతిపత్రాలు అందించారు.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

మిత్రుడికి సాయం

పి.గన్నవరం, జూలై20(ఆంధ్రజ్యోతి):1986 పదో తరగతి పూర్వవిద్యార్థుల్లో ఒకరు పి.గన్నవరానికి చెందిన చింతా అబ్బులు అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. మిత్రులు ఆదివారం రూ.25వేలు అబ్బులకు అందించారు. యర్రంశెట్టి నాగేశ్వరరావు, సుంకర కృష్ణ, నూకపేయి ఏడుకొండలు, యర్రంశెట్టి మదన్మోహన్, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాలను బలోపేతం చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

రాజోలు, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో ఉన్న 36 మత్స్యకార సహకార సంఘాలను బలోపేతం చేస్తానని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోంపల్లిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా ప్రాథమిక మత్స్య సహకార సంఘాలను ఫిష్ ఫార్మర్స్ ఉత్పత్తిదారుల సంస్థగా మార్చి వాటిని బలోపేతంచేసేలక్ష్యంతో జరుగుతున్న అవగాహన సదస్సు, శిక్షణ కార్యక్రమాల్లో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సోంపల్లిలో ఉన్న శ్రీకనకదుర్గ అగ్నికుల క్షత్రియ శాండ్ క్వారీ మత్స్య సహకార సంఘాన్ని ఫిష్‌ఫార్మర్ ప్రొడ్యూస్ ఆర్గనైజేషన్‌గా మార్చడం వల్ల ఈసంఘానికి ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా రూ.5లక్షలు నిర్వహణ వ్యయం కోసం మంజూరైందని తెలిపారు. మొదటి విడతగా మంజూరైన రూ.65,850 ప్రస్తుతం వీరి సంఘం ఖాతాకు జమ చేశారన్నారు. పీఎం మత్స్యసంపద యోజన పథకం ద్వారా రాష్ట్రంలో మొదటిగా సోంపల్లి మత్స్యసహకార సంఘం లబ్ధి పొందిందన్నారు. ప్రతీ మత్స్య సహకార సంఘం ఈ పథకం ద్వారా వచ్చే లబ్ధిని వినియోగించుకోవాలని ఆయన కోరారు. సంఘంలోని సభ్యుల ఆధారంగా రూ.10లక్షల వరకు మేచింగ్ గ్రాంట్ మంజూరు చేయబడుతుందన్నారు. మత్స్య అనుబంధ సంస్థల ద్వారా రూ.50లక్షల నుంచి రూ.2కోట్ల వరకు 7శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, రాజోలు నియోజకవర్గం టీడీపీ బూత్ కమిటీ కన్వీనర్ చాగంటి స్వామి, వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, జనసేన మండల అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఎఫ్‌సీఎస్ అధ్యక్షుడు శంకరపు ఆదినారాయణ, ఎఫ్‌హెచ్ కమిటీ సభ్యుడు తిరుమల ఆచార్యులు, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి సీహెచ్ గోపాలకృష్ణ, ఏపీసీఎఫ్‌పీ సెంట్రల్ టీమ్ సభ్యులు కె.గంగాధర్, పీవీఎస్ కోటేశ్వరరావు, సంఘ పెద్దలు, మత్స్యకార పెద్దలు, సొసైటీ అధ్యక్షులు, సభ్యులు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పేదలకు భరోసా



దేవగుప్తంలో తొలి అడుగు ప్రచారంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అల్లవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలుచేస్తూ పేదలకు టీడీపీ ప్రభుత్వం అండగా నిలిచిందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఆదివారం దేవగుప్తంలో టీడీపీ సుపరిపాలన తొలి అడుగు ప్రచారం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, వేగిరాజు వెంకట్రాజు, ఎస్.సుబ్రహ్మణ్యంరాజు, పచ్చిమాల ఏడుకొండలు, ఆకుల లక్ష్మణరావు, అల్లు సత్తిబాబు, బొర్రా రాజేష్, కొప్పిశెట్టి రామకృష్ణ, గుబ్బల నాగేశ్వరరావు, పోతుల నాగరాజు, ఎంపీటీసీ ముత్తాబత్తుల నాగరాజు, చిట్టూరి శ్రీను పాల్గొన్నారు.

శంకరగుప్తంలో 'సుపరిపాలన'

మలికిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ఆదివారం ఎనిమిదో రోజు నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తిరిగి వివరించి కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల యుగంధర్, రాపాక ఆనంద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ విధానాలతో ప్రజలకు తీరని నష్టం



సీపీఐ జిల్లా మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ప్రభాకర్, - జాతీయ సమితి సభ్యుడు మధు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశ ప్రజలకు తీరని నష్టం కలిగిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు దేగా ప్రభాకర్, సీపీఐ జాతీయ సమితి సభ్యుడు తాటిపాక మధు విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ధ్వజమెత్తారు. సీపీఐ జిల్లా మహాసభలు రెండో రోజు అమలాపురంలో నిర్వహించారు. బండారు సావిత్రి, జేసుదాసు, శీలం వెంకటేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించినా ప్రతినిధుల సభలో ఆదివారం వారు మాట్లాడారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లతో ప్రజలకు ధరల షాక్ తగులుతుందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఆదానీకి దేశ సంపదను దోచిపెట్టేందుకు మోదీ పరితపిస్తున్నారని విమర్శించారు. తొలుత సీపీఐ పతాకాన్ని డాక్టర్ చెలికాని స్టాలిన్ ఆవిష్కరించారు. ప్రతినిధుల సభలో జిల్లా కార్యదర్శి కొవ్వుల సత్తిబాబు దేవ రాజేంద్ర ప్రసాద్, పెద్దిరెడ్డి రాము, కె.రామకృష్ణ, నిమ్మకాయల శ్రీనివాస్, గెద్దం ప్రభాకరరావు, డి.చిట్టిరాజు మాట్లాడారు. ప్రజానాట్యమండలి గాయకులు వి.శామ్యూల్, ప్రేమానందం, శారద, వరలక్ష్మి తదితరులు విప్లవ గేయాలు ఆలపించారు.

శాకంబరిగా గ్రామదేవతలు దర్శనం

- అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పణ
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు






అమలాపురం: ఇందుపల్లి గ్రామదేవత మావుళ్లమ్మ, మామిడికుదురు: శాకంబరి అలంకరణలో పళ్లాలమ్మ, అంబాజీపేట: శాకంబరిగా రావులమ్మ, అయినవిల్లి:శాకంబరిగా కనకదుర్గమ్మ

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి గ్రామదేవత శ్రీమావుళ్లమ్మతల్లికి గ్రామంలోని ముత్తయిదువులు, యువతులు ఆదివారం భక్తులతో కలిసి ఆషాఢం సారె సమర్పించారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, ప్రత్యేక పళ్లాల్లో ఉంచుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాల నడుమ ఆలయం వద్దకు చేరుకుని అమ్మవారికి చీర, సారె సమర్పించారు. శాకంబరిగా దర్శనమిస్తున్న మావుళ్లమ్మకు సారె సమర్పించిన అనంతరం మహిళలు మొక్కులు తీర్చుకున్నారు. జనుపల్లి గ్రామదేవత జనుపల్లెమ్మ తల్లికి వందలాది మంది మహిళలు ఆషాఢం సారె సమర్పించారు. తొలుత సారె బిందెలను సంప్రదాయ బద్ధంగా మేళతాళాలతో ఊరేగించి అమ్మవారికి ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా అమలాపురం నల్లావీధి యువసేన ఆధ్వర్యంలో అమ్మవార్లకు ఆషాఢం సారె సమర్పించారు. నల్లావీధిలోని శ్రీవిజయదుర్గమ్మవారికి, గ్రామదేవత శ్రీసుబ్బాలమ్మతల్లికి చీర, సారె సమర్పించారు. నల్లావీధిలో ప్రతీ ఇంటి నుంచి ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేయించడంతో పాటు స్వీట్లు, పండ్లు తీసుకుని ప్రత్యేక కావిళ్లతో గ్రామోత్సవం నిర్వహించారు. అమ్మవార్లకు సారె సమర్పించిన అనంతరం మొక్కులు తీర్చుకున్నారు.

మాణిక్యాంబకు ఆషాఢం సారె

ఐ.పోలవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మురమళ్ళ గ్రామదేవతలు మాణిక్యాంబ, కనకమహాలక్ష్మీ అమ్మవార్లకు ఆదివారం ఆషాఢం సారె సమర్పించారు. మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి ఆలయ ఆధ్వర్యంలో అమ్మవార్లకు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే దంపతుల పూజలు నిర్వహించారు. తొలుత వీరేశ్వరస్వామి ఆలయం నుంచి వివిధ రకాల స్వీట్లు, పండ్లు, చలిమిడి పానకాలతో ఊరేగింపుగా మురమళ్ల మాణిక్యాంబ అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత ఎమ్మెల్యే దంపతులు కనకమహాలక్ష్మి అమ్మవారికి ఆషాఢం సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిగింది. కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, దాట్ల పృథ్వి, గుత్తుల సాయి, సర్పంచ్ కాలే రాజబాబు, దాట్ల రామకృష్ణంరాజు, సాగిరాజు సూరిబాబు రాజు, కాకర్లపూడి రాజేష్, జంపన బాబు, ఆలయ పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, ధూళిపూడి చక్రం, ఉప్పు వాసు, దాట్ల ఇంద్రరాజు, దాట్ల నరసింహరాజు, దాట్ల పవన్ పాల్గొన్నారు.

విజయలక్ష్మీదుర్గకు పుష్పాలంకరణ

కాట్రేనికోన, జూలై 20(ఆంధ్రజ్యోతి): గెద్దనపల్లి పంచాయతీ చింతలమెరకలో శ్రీవిజయలక్ష్మీదుర్గ అమ్మవారికి ఆషాఢం సందర్భంగా ఆదివారం విశేష పుష్పాలంకరణ చేశారు. ఆలయ పూజారి ఆకొండి శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కముజు లక్ష్మీరమణారావు, బొక్కా జగదీష్, సంసాని లక్ష్మణస్వామి, గుబ్బల రాంప్రసాద్, సంసాని మీరాసాహెబ్, వనచర్ల రామకృష్ణ దంపతులు, శీలం వేణు, అర్జున్, రాము, సత్తిబాబు, జైపాల్, వనచర్ల నరేంద్ర, గుత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

శాకంబరిగా పళ్లాలమ్మ

మామిడికుదురు, జూలై20(ఆంధ్రజ్యోతి):జగ్గన్నపేటలో వేంచేసి ఉన్న పళ్లాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో అమ్మవారిని వివిధరకాల కూరగాయలతో అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. శాకంబరిగా దర్శనమిచ్చిన అమ్మవారిని అధికసంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

గ్రామ దేవతలకు సారె

పి.గన్నవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో గ్రామదేవతలకు స్థానికులు విశేషపూజలు నిర్వహించారు. పి.గన్నవరం శివారు బొడపాటివారిపాలెంలో తాటమ్మ, కొండాలమ్మ అమ్మవార్లకు ఆషాఢం సారెను మహిళలు సమర్పించారు. ప్రత్యేక పూజలు అనంతరం వారి వెంట తెచ్చిన స్వీట్లను అమ్మవార్లకు సమర్పించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. పి.గన్నవరం గ్రామదేవత శ్రీతాటమ్మతల్లికి స్థానిక మహిళలు, ఆడపడుచులు ఆషాఢం సారె సమర్పించి శాకంబరి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీతాటమ్మతల్లికి వర్తక సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. కొండాలమ్మ, శ్రీతాటమ్మతల్లి అమ్మవార్లను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దర్శించుకున్నారు.

బలుసులమ్మకు సారె, చీర

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలోని గ్రామదేవత బలుసులమ్మ అమ్మవారికి ఆషాఢమాసం బహుళ దశమి సందర్భంగా సారె, చీర, తీపికావిడి కానుకగా సమర్పించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

శాకంబరిగా విజయదుర్గమ్మ

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): పళ్లవారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మవారు ఆషాఢ బహుళ దశమి ఆదివారం సందర్భంగా శాకంబరిదేవిగా పలు రకాల కూరగాయలతో అలంకరించారు. రకరకాల కూరగాయలతో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలోభక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శాకంబరి అలంకరణలో రావులమ్మ

అంబాజీపేట, జూలై 20(ఆంధ్రజ్యోతి): గంగలకుర్రు అగ్రహారం గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవార్ని ఆషాఢమాసం సందర్భంగా ఆదివారం శాకంబరిగా అలకరించారు. ఈసందర్భంగా వేకువజామునే ఊరేగింపుగా తీసుకువచ్చిన నదీ జలాలు, వివిధ రకాల ద్రవ్యాలతో వేదపండితులు మండా లక్ష్మీనరసింహమూర్తి అమ్మవార్కి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో విశేషంగా అలంకరించారు. అమ్మవార్ని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. గ్రామమంతా ఆడపడచులతో కళకళలాడింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అమ్మవార్ని పలువురు నాయకులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నూకాలమ్మకు ఆషాఢం సారె

మామిడికుదురు, జూలై 20(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు గ్రామదేవత నూకాలమ్మవారికి ఆషాఢమాసం పురస్కరించుకుని సారెను భక్తులు ఆనందోత్సాహాలతో ఆదివారం ఘనంగా సమర్పించారు. ముందుగా స్థానిక శివాలయం నుంచి మేళతాళాలు, భజాభజంత్రీలు, గరగ నృత్యాలు, బాణసంచా కాల్పులతో అధిక సంఖ్యలో భక్తులు సారెతో జాతీయ రహదారి మీదుగా అమ్మవారికి ఆలయానికి చేరుకున్నారు. వివిధ రకాల స్వీట్లు, పండ్లు, చలిమిడి, పానకం తదితర వాటిని మహిళలు పసుపుచీర ధరించిన శిరస్సుపై పెట్టుకుని అమ్మవారికి ఆలయానికి చేరుకుని సమర్పించారు. అమ్మవారిని, ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలు, ఫలాలు, కూరగాయలతో అలంకరించారు. కార్యక్రమం భక్తులతో పోటెత్తింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించి పూజలు చేశారు.

శాకంబరిగా కనకదుర్గమ్మ

అయినవిల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): యలకల్లంకలోని శ్రీకనకదుర్గమ్మను కూరగాయలతో శాకంబరిదేవిగా అలంకరించారు. ఆవాదివారం ఆషాఢమాసం సందర్భంగా కూరగాయల అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. అమ్మవారికి సారె, చలిమిడి, పానకాలు, పసుపు కుంకుమలను భక్తులు సమర్పించారు.





అమలాపురం: జనుపల్లెమ్మ, కాట్రేనికోన: పుష్పాలంకరణలో విజయలక్ష్మీదుర్గ ఐ.పోలవరం:మురమళ్ళ మాణిక్యాంబకు సారె తీసుకెళ్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు దంపతులు

'ప్రజలకు ఒరిగిందేమీ లేదు'

మలికిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని మలికిపురం వైసీపీ కార్యాలయంలో నిర్వహించారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రజలకు ఒరిగిందేమీలేదన్నారు. సమావేశంలో మట్టపర్తి నాగేంద్ర, కటకంశెట్టి ఆదిత్య, బల్ల ప్రసన్నకుమారి, తెన్నేటి కిశోర్, కూనపరెడ్డి రాంబాబు, పెన్మెత్స రంగరాజు, అన్నవరం, తాడి సహదేవ్ పాల్గొన్నారు.

'ఆ అరెస్టు అక్రమం'

ఉప్పలగుప్తం, జూలై 20(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ మిధున్‌రెడ్డి అరెస్టు అక్రమమని వైసీపీ జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను అన్నారు. రాజకీయ కక్షలో భాగంగానే ఆయనను అరెస్టు చేశారన్నారు.

ఐఐటీ సీటు సాధించిన యశ్వంత్‌కృష్ణకు సన్మానం

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి):బండారులంకకు చెందిన అంకం యశ్వంత్ కృష్ణ జేఈఈ మెయిన్స్‌లో 98.790 పాయింట్లు సాధించి జాతీయ స్థాయిలో 4652 ర్యాంకు సాధించాడు. కృష్ణను తల్లిదండ్రులు బాలసోమశేఖర్-రమాదేవి సమక్షంలో ఆదివారం స్థానిక ఊటుకూరి వీరబ్రహ్మం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో చైర్మన్ ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఘనంగా సత్కరించారు.

కేడర్ సమస్యను పరిష్కరించాలి

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్యను వెంటనే పరిష్కరించి, జీతాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, ఎంటీవీపీఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. అమలాపురం ఎంప్లాయిస్ హోంలో ఆదివారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల బదిలీలు జరిగి రెండు నెలలు పూర్తి కావస్తున్నా బదిలీ అయిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంగ్త్ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనివల్ల ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ సొమ్ములు ఇప్పటికీ చెల్లించలేదన్నారు. వెంటనే నిధులు విడుదలచేసి ఉపాధ్యాయులకు చెల్లించాలని కోరారు. పీ4 రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్బంధంగా కాకుండా స్వచ్ఛందంగా నిర్వహించేలా చూడాలన్నారు. ఆప్షనల్ హాలీడే వ్యక్తిగతంగా కాకుండా పాఠశాల మొత్తానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాశాఖ కార్యవర్గ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

అమలాపురం రూరల్, జూలై 20(ఆంధ్రజ్యోతి): రోళ్లపాలెం గున్నాపంతుల అగ్రహారం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు చెరుకూరి వెంకటసుబ్రహ్మణ్య కృష్ణమూర్తి, బూడిద వెంకటేశ్వరరావు, అక్కిరాజు ఫణిబాబులను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాల హెచ్‌ఎం బొంతు వరప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు చేసిన కృషిని కొనియాడి దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. గ్రామ సర్పంచ్ మట్ట వైదేహి-సాయిరామారావు, ఎంపీటీసీ నేదునూరి నాగరత్నం-నతానియేలు, గ్రామకమిటీ అధ్యక్షుడు మట్ట నాగేశ్వరరావు, నాయకులు గుమ్మళ్ల రెడ్డినాయుడు, తిరుమనాథం మురళీ, సింహాచలం, రంకిరెడ్డి సూర్యనారాయణ, పాఠశాల విద్యాకమిటీ చైర్‌పర్సన్ చుట్టుగుళ్ల తలుపులమ్మ, వైస్ చైర్మన్ పిల్ల భాస్కరరావు, యనమదల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చెట్ల పొదల్లోకి దూసుకుపోయిన కారు

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డు దొమ్మేటివారిపాలెం వద్ద ఆదివారం ఓ కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. అమలాపురం వైపు నుంచి యానాం వైపు వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. కారులో యానాం నీలపల్లిలో ఉంటున్న పాలకొల్లుకు చెందిన డ్రైవర్ కేతా మహేష్ ఉన్నారు. డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ దర్యాప్తు చేపట్టారు.

యంగ్‌మైండ్స్ అవార్డు గ్రహీతకు అభినందనలు

అమలాపురం టౌన్, జూలై 20(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న బీర హనుమంతరావుకు యంగ్ మైండ్స్ ఆదర్శ ప్రధానోపాధ్యాయ అవార్డుతో సత్కరించారు. శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసులు, పేరాబత్తుల రాజశేఖరం చేతులమీదుగా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతను జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి.మమ్మీ, ఉప విద్యాశాఖాధికారులు గుబ్బల సూర్యప్రకాశం, పి.రామలక్ష్మణమూర్తి, సెక్టోరియల్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంల సంఘ ప్రతినిధులు విత్తనాల శ్రీనివాస్, నిమ్మకాయల గణేశ్వరరావు, మోకా ప్రకాష్ తదితరులు అభినందించి సత్కరించారు.

రోడ్డును ఆధునికీకరించాలని ధర్నా



మామిడికుదురు, జూలై 20(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామంలోని తాడివారి మెరకకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని వెంటనే ఆ రోడ్డును ఆధునికీకరించాలంటూ స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. వర్షం వస్తే రోడ్డుపై ఉన్న గోతుల్లో వర్షపునీరు చేరి ప్రమాదకరంగా తయారైందని ఆందోళన చేశారు. గత 14 నెలల నుంచి రోడ్డు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే ఈ రోడ్డును నిర్మించాలంటూ నిరసన తెలిపి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇలియాజ్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, కుడుపూడి ప్రసాద్, ఇక్బాల్‌హుస్సేన్, పెదపూడి రాజేష్, పాటి చిన్నా, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి సంబరం

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలో అమలాపురం పార్లమెంటు మహిళా అధికార ప్రతినిధి బొక్కా రుక్మిణి స్వగృహం వద్ద ఆదివారం సత్తెమ్మతల్లి అమ్మవారి సంబరాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. భాజభజంత్రీలు, మేళతాళాలతో అమ్మవారిని ఊరేగించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సత్తెమ్మతల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యే వెంట గుత్తుల సాయి, చెల్లి అశోక్, ములపర్తి బాలకృష్ణ, కట్టా సత్తిబాబు, కాకి మాణిక్యం, విస్సు, గణేష్‌లతో పాటు పలువురు ఉన్నారు.

నేటి నుంచి ఉపకరణాల మంజూరుకు శిబిరాలు

యానాం, జూలై 20(ఆంధ్రజ్యోతి): యానాంలో దివ్యాంగులకు, వయోవృద్ధులకు ఉచితంగా కృతిమ ఉపకరణాలు అందజేసేందుకు అలిమ్‌కో సంస్థ సోమవారం నుంచి ఈనెల30వ తేదీ వరకు గ్రామాల వారీగా శిబిరాలు నిర్వహిస్తుందని పరిపాలనాధికారి మునిస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కృత్రిమ ఉపకరణాలు అవసరమైన వార్ని శిబిరాల్లో గుర్తిస్తారన్నారు. 21న సోమవారం గిరియాంపేట ప్రభుత్వ పాఠశాలలో, 22న దరియాలతిప్ప, 23న ఫరంపేట, 24న రవీంద్రనగర్, 25న పెదపూడి, 26న అంబేద్కర్‌నగర్, 28న మెట్టకుర్రు, 29న కనకాలపేట, 30న అగ్రహారంలోని ఆయా అంగన్ వాడీ కేంద్రాల్లో శిబిరాలు నిర్వహిస్తారన్నారు.

8వ రోజుకు చేరిన సమ్మె

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోరుతూ నగర పంచాయతీ ఇంజనీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి ఎనిమిదో రోజుకు చేరకుంది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘ ఉపాధ్యక్షుడు మొక్కవిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీక్షా శిబిరాన్ని ఏర్పాటుచేసి రిలే దీక్షలు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని, గతంలోని 17రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జీవో ఇవ్వాలని తదితర డిమాండ్లతో సమ్మె చేపట్టిన విషయం విదితమే. కార్యక్రమంలో నకిలే సూర్యనారాయణ, విళ్ల వీరాస్వామినాయుడు, ఎం.శ్రీనివాసరావు, ఎం.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులను కాపాడాలి

-నదీజలాలు, ప్రాజెక్టుల విశ్లేషకుడు లక్ష్మీనారాయణ

పి.గన్నవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న భారీ సాగునీటి ప్రాజెక్టులను నిత్యం పర్యవేక్షణ చేస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నదీజలాలు, ప్రాజెక్టుల విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. పి.గన్నవరం అక్విడెక్టు, పంటకాల్వను ఆదివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. కొత్త ప్రాజెక్టులపై చూపిస్తున్న ఆసక్తి పాత వాటిపై చూపితే సాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. రూ.5000కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతాయన్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టుతో పాటు పంటకాల్వలపై ప్రత్యేక దృష్టిచారించాల్సి ఉందన్నారు. పంటకాల్వల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. స్థానికంగా కాల్వల సమస్యలను, పాత, కొత్త అక్విడెక్టులు, లాకులు తదితర అంశాలను పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి ఆయనకు వివరించారు.

దళిత యువత ఉన్నత భవిష్యత్ వైపు పయనించాలి

మామిడికుదురు, జూలై 20(ఆంధ్రజ్యోతి): దళిత యువత మంచి భవిష్యత్ వైపు పయనించాలని దళిత యువత ఐక్య సమావేశం కోరింది. సమావేశం బొంతు మణిరత్నం ఆధ్వర్యంలో జరగ్గా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శెట్టెం శ్రీనివాస్ పాల్గొన్నారు. సమావేశంలో పలువురు మాట్లాడుతూ దళిత యువకులందరినీ ఒక తాటిపైకి తీసుకువచ్చి త్వరలో బహిరంగ సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉజ్వల భవిష్యత్తు వైపు నడవాలని, మాల మాదిగలు, ఉపకులాలు అన్నిరంగాల్లో అభివృద్ధి వైపు దూసుకువెళ్లాలని సమావేశం ద్వారా కోరారు. బొంతు సుధాకర్ ఉండ్రాజవరపు శివ, యార్లగడ్డ రవి, నాగాబత్తుల బద్రి, యువకులు పాల్గొన్నారు.

సొసైటీ చైర్మన్‌గా రవికుమార్ ప్రమాణ స్వీకారం



కాట్రేనికోన, జూలై 20(ఆంధ్రజ్యోతి):కుండలేశ్వరం సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణస్వీకారం ఆదివారం జరిగింది. చైర్‌పర్సన్‌గా గంగుమళ్ళ రవికుమార్, పర్సన్లగా బీర అంబేద్కర్, కర్రి సత్యనారాయణ ప్రమాణస్వీకారం చేశారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యేకు చైర్‌పర్సన్ రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఆకాశం శ్రీనివాస్, తవటపల్లి నాగేంద్ర, ఓగూరి భాగ్యశ్రీ, మోకా బాలప్రసాద్, నూకల దుర్గ, రంబాల రమేష్, నూకల మూర్తి, గంగుమళ్ళ బాబ్జి, గిడ్డి రత్నశ్రీ, గంగుమళ్ళ భద్రరావు, డీసీసీబీ మేనేజర్ పీతల శ్రీనివాస్, సీఈవో కోటిపల్లి సీతారామారావు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అయినవిల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి):విశాఖపట్నానికి చెందిన వరద కమలాకర్-అపర్ణ దంపతులు ఆదివారం కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. నిత్యాన్నప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించారు.

మృతదేహాలకు పోస్టుమార్టం

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి ముమ్మిడివరం మండలం అన్నంపల్లి పంచాయతీ లక్ష్మీదేవిలంక పంచాయతీలో శనివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మహిళ, ఒక వ్యక్తి మృతిచెందగా వారి మృతదేహాలకు ఆదివారం పోస్టుమార్టం నిర్వహించారు. ప్రమాదంలో మృతిచెందిన ఐ.పోలవరం మండలం కేశనకుర్రు జైబుద్ధనగర్‌కు చెందిన పచ్చిమాల లక్ష్మి(49)కి ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రిలో ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని ఆమె బంధువులకు అప్పగించారు. గాయపడి అమలాపురం ఆసుపత్రికి తరలిస్తుండగా పశ్చిమగోదావరి జిల్లా దిరుసుమర్రు శివారు పల్లిపాలేనికి చెందిన ప్రైవేటు ట్రావెల్ బస్సు డ్రైవర్ బొడ్డు రాంబాబు(34) మృతిచెందగా అమలాపురం ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు



ఉప్పలగుప్తం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం గ్రామంలో ఆదివారం పలువురు వైసీపీ కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు టీడీపీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అయితాబత్తుల అజయ్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. ఎస్.యానాం గ్రామాన్ని ఎమ్మెల్యే ఆనందరావు అభివృద్ధి చేస్తున్న తీరు, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు చూసి తాము టీడీపీలో చేరుతున్నట్టు దార రత్నబాబు, యార్లగడ్డ భాస్కరరావు, మందపాటి శ్రీను, యార్లగడ్డ బాసు, మందపాటి నరేష్, దారా శ్రీను తదితరులు అన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, డీసీఎంస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, నీటిసంఘం చైర్మన్ బండారు వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, అయితాబత్తుల మీరాకుమార్, ఉండ్రు శామ్యూల్, అయితాబత్తుల నాగప్రసాద్, పోతుల బుజ్జి పాల్గొన్నారు.

చేనేత సంఘాలకు నామినేటెడ్ కమిటీలు వేయాలి

మలికిపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): చేనేత సంఘాలకు నామినేటెడ్ కమిటీలు వేయాలని, లేనిపక్షంలో ఎన్నికలు జరపాలని మంత్రి నిమ్మల రామానాయుడు కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మలకు రాష్ట్ర చేనేత నాయకులు చింతా వీరభద్రేశ్వరరావు వినతిపత్రం సమర్పించారు. చేనేత సహకార సంఘాలు అధికారుల పాలనలో కొనసాగుతున్నాయని, దీని ద్వారా సంఘాలు కుంటుపడడంతో పాటు స్థానిక ఉపాధి అవకాశాలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వం నుంచి సంఘాలకు, కార్మికులకు రావాల్సిన రాయితీలు, సబ్సిడీల గురించి వినతిపత్రంలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత సంఘాలు బకాయి పడిన రిబేటు, నూలు సబ్సిడీ, త్రిఫ్ట్‌ఫండ్ వగైరా చెల్లిస్తూ ప్రభుత్వం గతంలో వాగ్దానం చేసిన విధంగా కేంద్ర సహకార బ్యాంకులకు చెల్లించాల్సిన రుణాలు మాఫీచేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. చేనేత కార్మికులకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని వెంటనే అమలు చేయాలని కోరారు.

కూటమి పాలనలో రాష్ట్రం పురోభివృద్ధి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం మందపల్లి గ్రామంలో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏడాది పాల నలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు తెలిపారు. అనంతరం స్థానిక సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ధర్నాల రామకృష్ణ, చింతం విజయకృష్ణ మోహన్, సిద్దంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, గనిశెట్టి వీరేష్, ముద్రగడ ఫణి, బూసి భాస్కరరావు, శర్మ, కంఠంశెట్టి శ్రీనివాసరావు, కొల్లి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.


మందపల్లిలో సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే బండారు


రాయవరం మండలం చెల్లూరులో సొసైటీ పాలకవర్గ సభ్యులను అభినందిస్తున్న లీలాకృష్ణ తదితరులు

సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం చర్యలు

రాయవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గత పాలనలో నిర్వీర్యమైన సహకార వ్యవస్థ బలోపేతానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని నీటిపారుదల అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని చెల్లూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దేవళ్ల వెంకట్రావు అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో లీలాకృష్ణ మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు త్రిసభ్య కమిటీలు మెరుగైన సేవలందించాలన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న డీసీఎంఎస్ చైర్మన్ పి.చంద్రమౌళి మాట్లాడుతూ మార్కెటింగ్ శాఖ ద్వారా విత్తనాలు, ఎరువులు గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అందించేందుకు సహకార సంఘాలకు చేయూతనిస్తామన్నారు. త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకట్రావు, సభ్యులుగా తలాటం వెంకటేష్, మేడిశెట్టి నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. త్రిసభ్య కమిటీని లీలాకృష్ణ, చంద్రమౌళి సమక్షంలో కూటమి నాయకులు, గ్రామస్థులు, రైతులు సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొల్లపల్లి అనురాధ, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు చుండ్రు వీర్రాజు, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రిమ్మలపూడి వేణుగోపాల దొర, జనసేన నాయకులు వల్లూరి సత్యప్రసాద్, గొల్లపల్లి వెంకటరమణ, మాజీ సర్పంచ్‌లు నూనే ఏసుబాబు, నూనే శ్రీదేవి, మోరంపూడి రాజ్‌కుమార్ కూటమి నాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.



అంగరలోనున్న అశిరాంబ అమ్మవారు. పక్క చిత్రంలో గరగ నృత్యాలతో అమ్మవారి జాతర నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా అశిరాంబ అమ్మవారి జాతర

కపిలేశ్వరపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న అశిరాంబ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గరగనృత్యాలు, డప్పువాయిద్యాలు, సన్నాయి మేళాలు, కేరళ వాయిద్యాలు, విచిత్ర వేషాలతో బాణసంచా మధ్య అమ్మవారి జాతరను వైభవంగా జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు, గాజులు, చీర, రవిక, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. సోమవారం ఆలయం వద్ద తీర్థం, మంగళవారం అమ్మవారికి నైవేద్యాలతో జాతర కార్యక్రమాలు ముగియనున్నట్టు ఆలయ కమిటీ తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక, గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో పరిసర గ్రామాల భక్తులు, అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


ఆలమూరు ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న నాయకులు

ఆలమూరు ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ఆలమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆలమూరులో ఆదివారం అట్టహాసంగా జరిగింది. పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ముందుగా జొన్నాడ నుంచి ఆలమూరు, కొత్తూరు నుంచి ఆలమూరు వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాలకవర్గ చైర్‌పర్సన్‌గా జనసేన పార్టీకి చెందిన కొత్తపల్లి వెంకటలక్ష్మి, వైస్ చైర్మన్‌గా కేతా రాంబాబుతోపాటు డైరెక్టర్లుగా 15 మంది ప్రమాణ స్వీకారం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు మేలైన సేవలందించాలని వక్తలు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, నాయకులు ఆకుల రామకృష్ణ, వంటిపల్లి పాపారావు, ఎ.సత్తిబాబు, బండారు సంజీవ్, ఈదల సత్తిబాబు, సూరపురెడ్డి సత్య తదితరులు పాల్గొన్నారు.


కాకినాడలో అవార్డు తీసుకుంటున్న ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వరరావు

వెంకటేశ్వరరావుకు అవార్డు రావడంపై హర్షం

కె.గంగవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): గంగవరం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొడగట్లపల్లి వెంకటేశ్వరరావు యంగ్ మైండ్స్ ఆదర్శ ప్రధానోపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. ఆదివారం కాకినాడ దంటు కళాక్షేత్రంలో వాకాడ చిన్ని ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో శాసనమండలి సభ్యులు గాదె శ్రీనివాసుల నాయుడు, పేరాబత్తుల రాజశేఖర్ సమక్షంలో అందజేశారు. విద్యా రంగంలో చూపిన అంకిత భావం, సమర్థతలకు గుర్తింపుగా ఈ అవార్డు యంగ్ మైండ్స్ సంస్థ ప్రదానం చేసింది. అవార్డు అందుకున్న ఆయన్ను ఎంఈవో1 ఏ.నాగరాజు, ఎంఈవో2 చోడిశెట్టి ఆంజనేయులు, జిల్లా సైన్స్ అధికారి గిరిజాల వీఎస్ సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు ఏడుకొండలు, శ్రీధర్, కె.శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

చెట్ల పొదల్లోకి దూసుకుపోయిన కారు

ముమ్మిడివరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డు దొమ్మేటివారిపాలెం వద్ద ఆదివారం ఓ కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్ల పొదల్లోకి దూసుకుపోయింది. అమలాపురం వైపు నుంచి యానాం వైపు వెళుతున్న కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లోకి దూసుకుపోయింది. కారులో యానాం నీలపల్లిలో ఉంటున్న పాలకొల్లుకు చెందిన డ్రైవర్ కేతా మహేష్ ఉన్నారు. డ్రైవరు సురక్షితంగా బయటపడ్డాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ దర్యాప్తు చేపట్టారు.



నిడసనమెట్ట వద్ద బీటలు వారి ఎండిపోతున్న వరిచేలు. పక్క చిత్రంలో అచ్యుతాపురం వద్ద మోటార్లతో సాగునీటిని తరలిస్తున్న రైతులు

వరిచేలు బీటలు వారుతున్నా పట్టించుకోరా?

• ఇరిగేషన్ అధికారుల ఉదాసీనతపై అసంతృప్తి • సాగునీరు అందక రైతులకు తప్పని ఇబ్బందులు

కపిలేశ్వరపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్యుతాపురం, నిడసనమెట్ట గ్రామాల పరిధిలోని పంట పొలాలకు సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాల్లో పలుచోట్ల వేసిన వరినాట్లకు నీరందక ఎండిపోయి బీటలు వారుతున్నాయి. దీంతో పలువురు రైతులు మోటర్ల ద్వారా నీరు తోడుకుంటూ పంటచేలను కాపాడుకుంటున్నారు. సాగునీరు అందకపోవడంతో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని రైతులు వాపోతున్నారు. పంట కాలువల నుంచి శివారు భూములకు నీరు సరఫరా కావడం లేదని వాపోతున్నారు. పంటను ఎలా దక్కించుకోవాలో తెలియడం లేదని ఆవేదన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి పంట చేలకు నీరందేలా ఇరిగేషన్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత రైతులు కోరుతున్నారు.

గణిత ఒలింపియాడ్‌లో భారత్‌కు 7వ స్థానంపై హర్షం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 20 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్‌లో దేశానికి ఏడవ స్థానం దక్కడం గర్వకారణమని రామానుజన్ గణిత అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కేవీవీ సత్యనారాయణ అన్నారు. ఆస్ట్రేలియాలో సన్‌షైన్ కోస్ట్‌లో జూలై 10 నుంచి 19 వరకు 66వ అంతర్జాతీయ గణిత ఒలింపియాడ్ జరిగిందన్నారు. ఒలింపియాడ్‌లో ప్రథమస్థానంలో చైనా, ద్వితీయ స్థానంలో అమెరికా పొందాయన్నారు. ఒలింపియాడ్‌లో 110 దేశాలు పాల్గొనగా అందులో మనదేశం 7వ స్థానం దక్కించుకోవడంపై ఆయనతో పాటు రేవతి సైన్సు ఫౌండేషన్ అధ్యక్షుడు కె.శ్రీకృష్ణసాయి, గణిత అవధాని ఎం.నాగార్జున, పీవై వెంకట్రావులు హర్షం వ్యక్తం చేశారు.


శాకంబరిగా దర్శనం ఇచ్చిన నర్సిపూడి దానాలమ్మ అమ్మవారు

శాకంబరిగా దానాలమ్మ

ఆలమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): నర్సిపూడి గ్రామదేవత దానాలమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాడమాసం సందర్భంగా అమ్మవారిని భక్తులు వివిధ రకాల కూరగాయాలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రిష్వంత్‌రాయ్ ఎంపిక యువతకు దక్కిన గౌరవం

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూలై 20 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు అక్కల రిష్వంత్‌రాయ్ ఎంపిక యువతకు ఇచ్చిన గౌరవం అని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి అల్లం దివాకర్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ కష్టపడే వారికి గుర్తింపు ఇస్తుందని, యువతరాన్ని ప్రోత్సహించడంలో పార్టీ ముందుంటుందనడానికి ఇదే ప్రధాన ఉదాహరణగా పేర్కొన్నారు. యువతను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తామన్నారు.


వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యుడు

ఉచిత దంత వైద్య శిబిరం

కె.గంగవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం జరిగింది. రామచంద్రపురం కేవీఆర్ ఆసుపత్రి, పెనుగుదురు అంజన మల్టీ స్పెషాలిటీ డెంటల్ ఆసుపత్రి వారు సంయుక్తంగా ఏర్పాటు చేశారు. శిబిరంలో గంగవరం, తామరపల్లి, కోటిపల్లి, కోట, దంగేరు తదితర గ్రామాల నుంచి వచ్చిన రోగులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కేవీఆర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కోట సతీష్, రమ్య, డాక్టర్ సలాది వీర వెంకటేష్, శివ సవర్ణ, చందు వైద్య సేవలు అందించారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

ఆత్రేయపురం, జూలై 20(ఆంధ్రజ్యోతి): మెర్లపాలెం ప్రాథమిక పాఠశాల-3లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ బదిలీపై వెళుతున్న కడలి ప్రసాద్ దంపతులను ఆదివారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. ఎంఆర్‌పిఎయస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్మర రాఘవ, ఎంఎస్‌పి జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం యాకోబు, ముప్పిడి రాజు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దంపతులను ఘనంగా సత్కరించారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, జూలై 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన వరద కమలాకర్, అపర్ణ దంపతులు ఆదివారం అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. నిత్యాన్న ప్రసాద ట్రస్టుకు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. వీరికి ఆలయ అర్చకులు, వేదపండితులు వేదాశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రంతో వారిని సత్కరించారు.

సాగునీరు ప్రాజెక్టులను కాపాడాలి

నదీజలాలు, ప్రాజెక్టుల విశ్లేషకుడు లక్ష్మీనారాయణ

పి.గన్నవరం, జూలై 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న భారీ సాగునీటి ప్రాజెక్టులను నిత్యం పర్యవేక్షణ చేస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభు త్వాలపై ఉందని నదీజలాలు, ప్రాజెక్టుల విశ్లేషకులు టి.లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. పి.గన్నవరం అక్విడెక్టు, పంటకాల్వను ఆదివారం ఆయన పరిశీలించి అనంతరం మాట్లాడారు. కొత్త ప్రాజెక్టులపై చూపిస్తున్న ఆసక్తి పాత వాటిపై చూపితే సాగునీరు సరఫరా పూర్తిస్థాయిలో అందుతుందన్నారు. రూ.5000కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అభి వృద్ధి చెందుతాయన్నారు. ధవళేశ్వరం ప్రాజెక్టుతో పాటు పంటకాల్వలపై ప్రత్యేక దృష్టిచారించాల్సి ఉందన్నారు. పంటకాల్వల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. స్థానికంగా కాల్వల సమస్యలను, పాత, కొత్త అక్విడెక్టులు, లాకులు తదితర అంశాలను పి.గన్నవరం సాగునీటి డిస్ట్రిబ్యూటరి కమిటీ వైస్ చైర్మన్ చొల్లంగి సత్యనారాయణమూర్తి ఆయనకు వివరించారు.


ద్రాక్షారామలో ముత్యాలమ్మకు సారె సమర్పిస్తున్న అర్చకులు, మహిళలు


కపిలేశ్వరపురం మండలం అంగరలో అమ్మవార్ల సారెతో ఊరేగుతున్న భక్తులు

ముత్యాలమ్మకు సారె సమర్పించిన భీమేశ్వరస్వామి దేవస్థానం

ద్రాక్షారామ, జూలై 20(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలోనున్న ముత్యాలమ్మవారికి భీమేశ్వరస్వామి దేవస్థానం తరపున ఆదివారం ఆషాడం సారె సమర్పించారు. భీమేశ్వరాలయం వద్ద నుంచి ఆలయ అర్చకులు, వేద పండితులు, సిబ్బంది, మహిళలు పసుపు కుంకుమ, చీర, సారె, పండ్లు, స్వీట్లతో ఊరేగింపుగా ముత్యాలమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సారె సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.


కొత్తపేటలో శాకంబరిగా వానపల్లి పళ్ళాలమ్మ అమ్మవారు

ఇలింద్రమ్మ తల్లికి ఆషాడం సారె..

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం హసన్‌బాదలోనున్న ఇలింద్రమ్మకు గ్రామస్థులు ఆదివారం ఆషాడం సారె సమర్పించారు. పసుపు, కుంకుమ, సారె, చీర, పండ్లు, స్వీట్లతో ఇలింద్రమ్మ ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ చింతపల్లి వీరభద్రరావు, అధిక సంఖ్యలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక, ఆదిలక్ష్మి అమ్మవార్లకు సారె..

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): అంగర గ్రామంలోనున్న నూకాంబిక, ఆదిలక్ష్మి అమ్మవార్ల సారె వేడుక ఆదివారం జరిగింది. దేవదాయ శాఖ ఉద్యోగి గంగుమళ్ళ లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో పండ్లు, పానకాలు, పిండి వంటలతో మేళతాళాల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. వేద పండితులు సంపర సుమంత ఆధ్వర్యంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆషాడం సారెతో వెళ్లిన మహిళలు

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామదేవత శ్రీవాగ్దేవి నగర మహలక్ష్మి అమ్మవారికి ఆడపడుచులు ఆషాడం సారె సమర్పించారు. ఆదివారం మేళ, తాళ మంగళ వాయిద్యాలతో మహిళలు ఊరేగింపుగా వివిధ రకాల స్వీట్లు, చలివిడి, వడపప్పు, పానకంతో ఊరేగింపుగా వాకులమ్మతల్లికి పలువురు గ్రామ ఆడపడుచులు సారెలు సమర్పించుకున్నారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వందలాది మంది మహిళలు పాల్గొన్నారు.

శాకంబరిగా దర్శనం

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): వానపల్లి పళ్ళాలమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిగా దర్శనమిచ్చారు. ప్రతి ఏడాది ఆషాడమాసం చివరి ఆదివారం అమ్మవారిని శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తున్నది. గ్రామంలోని ఆడపడుచులు అదే రోజు ఆషాడం సారెను అమ్మవారికి సమర్పిస్తారు. ఈ సందర్భంగా మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగింపుగా వచ్చి ఆషాడం కావిడను అమ్మవారికి సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించారు. ఆలయ ఈవో భాగవతుల వెంకటరమణమూర్తి వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అమ్మవారికి ఆషాడం సారె

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఆషాడ మాసం సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారికి ఆషాడం సారె సమర్పించారు. రావులపాలెం మండలం లక్ష్మీపోలవరం గ్రామదేవత కనకదుర్గకు మొదటిసారిగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ, అమ్మవారి పుట్టింటి వాళ్లు ఆషాడం సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శాకంబరిగా దర్శనమిచ్చిన ఆత్రేయపురం మండలం ర్యాలీ వాగ్దేవి అమ్మవారు


వాడపల్లి వెంకన్న ఆలయంలో అష్టోత్తర పూజలను తిలకిస్తున్న భక్తులు

వాడపల్లి ఆదాయం రూ.7.46 లక్షలు

ఆత్రేయపురం, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు స్వామివారికి అష్టోత్తర పూజలు జరిపి మొక్కులు చెల్లించారు. స్వామి వారి కల్యాణం, గోపూజ నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఆదాయం రూ.7,46,000 వచ్చినట్లు ఉప కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన సీహెచ్ వెంకట రామసుబ్బారావు, నాగకళ్యాణి దంపతులు రూ.51,116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సిబ్బంది స్వామి వారి చిత్రపటం అందజేశారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించిన అధికారులు

ఆలమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సందిపూడిలో ఇటీవల రెండు ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతినడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో నాయకుల ఫిర్యాదుతో అధికారులు స్పందించి తక్షణం రిపేర్లు చేసి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశారు. ఇటీవల గ్రామంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో రాత్రి సమయంలో విద్యుత్ నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రాన్స్‌కో రామచంద్రపురం ఈఈ రత్నాలరావు, మండపేట ఏడీ శ్రీధర్, ఆలమూరు ఏఈ దుర్గాప్రసాద్, ఎల్ఐ సత్యనారాయణ సకాలంలో స్పందించి ట్రాన్స్‌ఫార్మరులను మరమ్మతులు చేయించి విద్యుత్ సక్రమంగా వచ్చేలా చర్యలు చేపట్టారు. విద్యుత్ సమస్యను పరిష్కరించిన అధికారులను గ్రామస్తులు అభినందించారు.




సంధిపూడిలోనున్న వేణుగోపాలస్వామి

నేడు వేణుగోపాలస్వామికి లక్షతులసిపూజ

ఆలమూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): సంధిపూడిలోనున్న వేణుగోపాలస్వామి ఆలయంలో 21న స్వామివారికి లక్షతులసి పూజ నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ భక్తమండలి కమిటీ అధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ముందుగా స్వామివారికి విశ్వక్సేన ఆరాధన, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారని ఆలయ భక్త కమిటీ ప్రతినిధులు తెలిపారు. అనంతరం స్వామివారికి లక్షతులసిపూజ, మహాశాంతి హోమం, సాయంత్రం స్వామివారి కల్యాణోత్సవం జరుగుతందన్నారు. కార్యక్రమంలో కవి కృష్ణశ్రీ రచించిన సుందర సందేశం పుస్తకావిష్కరణ జరుగుతుందని వారు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

రోడ్డును ఆధునికీకరించాలని ధర్నా

మామిడికుదురు, జూలై 20(ఆంధ్రజ్యోతి): నగరం గ్రామంలోని తాడివారి మెరకకు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైందని వెంటనే ఆ రోడ్డును ఆధునికీకరించాలంటూ స్థానికులు ఆదివారం ధర్నా చేశారు. వర్షం వస్తే రోడ్డుపై ఉన్న గోతుల్లో వర్షపునీరు చేరి ప్రమాదకరంగా తయారైందని ఆందోళన చేశారు. కొన్ని నెలల నుంచి రోడ్డు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపించారు. వెంటనే ఈ రోడ్డును నిర్మించాలంటూ నిరసన తెలిపి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఇలియాజ్ హుస్సేన్, ఎంకే అబ్బాస్, కుడుపూడి ప్రసాద్, ఇక్బాల్‌హుస్సేన్, పెదపూడి రాజేష్, పాటి చిన్నా, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డును నిర్మించాలంటూ ధర్నా చేస్తున్న దృశ్యం